## కోర్టు ఆవరణలో శ్రమదానం



కొల్లాపూర్ కోర్టు ఆవరణలో శ్రమదానం చేస్తున్న జడ్జీలు

కొల్లాపూర్, అక్టోబర్ 7: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో కొల్లాపూర్ కోర్టు ఆవరణలో జడ్జిలు శనివారం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా పరిసరాల్లో ఊడిచి చెత్తను తొలగించారు. రాష్ట్ర, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల ప్రాంగణంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఆర్వీఎస్ఎస్ మిథున్ తేజ, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్న గుంటి ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్ సిబ్బంది, మూడు కోర్టుల సిబ్బందితో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వసంతరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు కురుమూర్తి, మోహన్‌లాల్, న్యాయవాదులు నాగరాజు, నిరంజన్, గోవింద్, మనోహర్, నళిని పాల్గొన్నారు.

## పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌కు శుభాకాంక్షలు

కొల్లాపూర్, అక్టోబర్ 7: రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా డాక్టర్ రాంచందర్ నియమితులయ్యారు. దీంతో నాగర్‌కర్నూల్ జిల్లా గొర్రెల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడు గాలియాదవ్ శనివారం హైదరాబాద్‌లో వారి కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రామచందర్ నీతి, నిజాయితీతో వృత్తిపై అంకితభావంతో, సంపూర్ణంగా తన బాధ్యతలను పూర్తి స్థాయిలో న్యాయం చేస్తారని పేర్కొన్నారు.



రాంచందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గాలియాదవ్

## బతుకమ్మ చీరలు పంపిణీ



జొన్నలబొగుడలో చీరలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఇందిర

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 7: మండలంలోని యాపట్ల, గంట్రావుపల్లి, దేవునితిర్మలాపూర్, జొన్నలబొగుడ తదితర గ్రామాల్లో దసరా పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం అందజేస్తున్న బతుకమ్మ చీరలను సర్పంచ్ ఇందిర మహిళలకు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దసరా పండుగ రోజు ఆడబిడ్డలకు ముఖ్యమంత్రి కేసీఆర్ కానుకగా ప్రతి సంవత్సరం చీరలను పంపిణీ చేస్తున్నారని ఆమె తెలిపారు. కేసీఆర్ మహిళా సంక్షేమాని ఎంతో కృషి చేస్తూ అన్నిరంగాల్లో రాణించేందుకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొజ్జమ్మ, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు రవినాయక్, ఈశ్వర్, గోపాల్ నాయక్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలను ప్రారంభించేందుకు సన్నాహాలు

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 7: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులు ప్రారంభించేందుకు ఎంపీడీవో కృష్ణయ్య, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు నాగరాజు, హెచ్ఎం మద్దిలేటి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కృష్ణయ్య మాట్లాడుతూ.. ఈనెల 9వ తేదీన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి జూనియర్ కళాశాల తరగతులు ప్రారంభించాలని సూచించడంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇటీవల పదో తరగతి పూర్తయిన విద్యార్థులు అడ్మిషన్లు తీసుకొని కళాశాలలో చేరాలన్నారు. కార్యక్రమానికి ఉన్నత విద్యాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. కళాశాల మంజూరు చేయించి తరగతులు ప్రారంభిస్తుండడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

# మాట నిలబెట్టుకున్నా.. మరోసారి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- పెంట్లవెల్లి మండలంలో అభివృద్ధి పనులకు భూమిపూజ
- రూ.33కోట్లతో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన
- పెంట్లవెల్లి-ఎంగంపల్లితండా వాగుపై వంతెన ప్రారంభం



మల్లేశ్వరంలో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పెంట్లవెల్లి, అక్టోబర్ 7: గత అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చినమాట ప్రకారం సీఎం కేసీఆర్ సహకారంతో అభివృద్ధిలో పరుగులు పెట్టించి ఇచ్చిన మాట నిలుపుకున్నానని.. రానున్న ఎన్నికల్లో మరోమారు నన్ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మల్లేశ్వరంలో రూ.33కోట్లతో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం సర్పంచ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ.. మల్లేశ్వరం గ్రామం గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా అభివృద్ధికి నోచుకోక మరుగునపడిందని, నేను ఎమ్మెల్యేగా గెలిచిన అతి తక్కువ సమయంలోనే మల్లేశ్వరం మెరిసిపోయేలా అభివృద్ధి చేశానన్నారు. చిన్నపాటి వర్షం వస్తే నదీతీర గ్రామాలైన మల్లేశ్వరం, వేంకల్, ఎంగంపల్లితండా గ్రామాలు సమీపంలోని వాగుపై రాకపోకలు సాగించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పెంట్లవెల్లికి వేళ్లేవారని పేర్కొన్నారు. గత ఎన్నికల ప్రచారం కోసం వచ్చినప్పుడు స్వయంగా గమనించి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చానని, ఇచ్చినమాట ప్రకారం సీఎం కేసీఆర్ సహకారంతో పంచాయతీరాజ్ నిధుల నుంచి రూ.9.65లక్షలను మంజూరు చేయించి చెక్‌డ్యాంతోపాటు బ్రిడ్జి నిర్మించి ప్రారంభించుకున్నామన్నారు. అంతేకాక గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న కృష్ణానది తీరం నుంచి సాగునీరు అందని ద్రాక్షగా మల్లేశ్వరంతోపాటు, వేంకల్, ఎంగంపల్లి తండాలకు మిగిలిపోయిందని బీడువారిన పొలాలకు సాగునీరు అందించేందుకు సీఎం కేసీఆర్ సహకారంతో రూ.33కోట్లతో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను నిర్మించేందుకు నిధులను మంజూరు చేయించి జీవో కాపీతో శంకుస్థాపన చేశామన్నారు. ఈ పనులను త్వరగా పూర్తి చేసిన తర్వాత నేనే లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తాన్నారు.
అంతేకాక మల్లేశ్వరం సమీపంలోని కృష్ణానది మధ్యలో ఉన్న గుట్టను మినీ హైలాండ్‌గా అభివృద్ధి చేసి గ్రామాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతామన్నారు. గత పాలకులు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌తో పాటు, ఎంగంపల్లితండా వాగుపై వంతెన నిర్మించమని గ్రామస్తులు అడిగితే ఇదిగో సాంక్షన్, అదిగో ఆడర్ కాపీ అంటూ.. ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. 18ఏండ్లపాటు ఎమ్మెల్యే, మంత్రిగా ఉండికూడా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేక పోయారన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాలుగున్నరేండ్లలో 2ఏండ్లు కరోనాతో సరిపెట్టుకోగా.. ఈ విపత్కర పరిస్థితిల్లో కేవలం రెండున్నరేండ్లలోనే మన సీఎం కేసీఆర్ సహకారంతో కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పలురుగులు పెట్టించానన్నారు. మరోమారు రానున్న ఎన్నికల్లో నన్ను ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని గ్రామస్తులను కోరారు. అంతకుముందు ఎమ్మెల్యేకు మహిళలు హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి పటాకులు కాలుస్తూ ర్యాలీ నిర్వహించారు.

### పల్లెదవాఖాన ప్రారంభం

మండలంలోని మంచాలకట్టలో నిర్మించిన పల్లె దవాఖానను ప్రారంభించి, కల్యాణ మండపం నిర్మిణానికి భూమిపూజ చేశారు. అనంతరం పెంట్లవెల్లి–ఎంగంపల్లితండా సమీపంలోని వాగుపై రూ.9.65లక్షలతో నిర్మించిన చెక్‌డ్యాంతోపాటు బ్రిడ్జిని ప్రారంభించారు. మండల కేంద్రం సమీపంలో 33/11కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు రాజేశ్, సురేందర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మతీన్, మంచాలకట్ట సర్పంచ్ విజయ్, కోఆప్షన్ మండల సభ్యుడు అబ్దుల్‌హుస్సేన్, ఎంపీటీసీ ఈశ్వరికుమారి, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రామకృష్ణ, రఫీ, సింగిల్ విండో డైరెక్టర్లు బాలరాజు, సత్యనారాయణ, మాజీ ఎంపీపీ హన్మంత్, నాయకులు ఉన్నారు.

## ఇది పేదల ప్రభుత్వం

కొల్లాపూర్ రూరల్, అక్టోబరు 7: పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వమని.. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సింగోటంలో అర్హులైన లబ్ధిదారులు 276మందికి ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మంగళవాయిద్యాలతో గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. గ్రామంలోని అర్హులైన ప్రతిఒక్కరికీ గృహలక్ష్మి పథకం వస్తుందన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కావడం జరిగిందన్నారు. సోమశిల సిద్ధేశ్వరం వంతెన నిర్మాణంతో కొల్లాపూర్‌లో శాశ్వత అభివృద్ధి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## గ్రామాలాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 7: గ్రామాలాభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తూ నిధులు మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆదిరాలలో రూర్బన్ మిషన్ పథకం ద్వారా రూ.15లక్షల75వేలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని సర్పంచ్ భాగ్యమ్మతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా అంతకుముందు గ్రామస్తులు డప్పులతో ఘనస్వాగతం పలికారు. భారీ జగమాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ చిన్న గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయడంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ప్రత్యేక పంచాయతీలను ఏర్పాటు చేశారన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఎస్‌డీఎఫ్ నుంచి రూ.15 లక్షలు మంజూరు చేశానని, మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి పలువురు చేరడంతో వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరే వారికి తగిన గుర్తింపునిస్తూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పెద్దకొత్తపల్లి మండలాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నానన్నారు. పెద్దకొత్తపల్లికి జూనియర్ కళాశాల, బాచారం హైలెవల్ కెనాల్ మంజూరు, మరెన్నో అభివృద్ధి పనులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ రాజగౌడ్, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు నాగరాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గణేశ్‌రావు, నాయకులు పాల్గన్నారు.

# పాలిటెక్నిక్ కళాశాల మంజూరుపై హర్షం

- పట్టణంలో విద్యార్థుల ర్యాలీ
- సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే బీరం ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం

కొల్లాపూర్, అక్టోబర్ 7: స్థానిక ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కొల్లాపూర్ నియోజకవర్గానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరైనందుకు హర్షన్న యూత్ ఫోర్స్ అధ్యక్షుడు బాబా ప్రిన్స్, బీఆర్వీఎస్వీ నాయకులు శేఖర్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో వివిధ పాఠశాలల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే బీరం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి ప్రభుత్వం జారీ చేసిన కళాశాల జీవో ప్రతిని చిత్రపటాలకు కట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతనెల 16న కొల్లాపూర్ బహిరంగసభలో ఎమ్మెల్యే బీరం వినతి మేరకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం కొల్లాపూర్ నియోజకవర్గానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేస్తూ అనుమతులు జారీ చేసిందన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హార్టికల్చర్ డిప్లొమా కళాశాల, బీసీ రెసిడెన్షియల్ కళాశాల, పెద్దకొత్తపల్లి మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కావడంతో ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కొల్లాపూర్ ప్రాంతానికి పాలిటెక్నిక్ కళాశాల రావడంతో ఈ ప్రాంత విద్యార్థులు ఉన్నతస్థాయిలో చదువుల కోసం ఉపయోగపడుతుందన్నారు. కొన్నేండ్లుగా ఎవరూ కూడా విద్యార్థుల కోసం ఆలోచించలేదని బాబా ప్రిన్, శేఖర్ పేర్కొన్నారు. పిల్లల చదువుల కోసం దూరప్రాంతాలకు పంపకుండా మనకు అందుబాటులోనే ఇలాంటి కళాశాల రావడం ఎంతో శుభపరిణామం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు బంగయ్యగుట్ట ఫయాజ్, శ్రీరామ్, రవి, గురుమూర్తి, అభిషేక్, ఇమ్రాన్, కుమార్, రహీం, శామిత్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే బీరం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీరం యూత్ ఫోర్స్ సభ్యులు